విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 24, ఫిబ్రవరి 2023

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నాగరాజు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. ఉగాది పండుగ నాటికి ఇళ్ల పనులను పూర్తి చేసి గృహప్రవేశాలు జరిగేలా చూడాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం బిల్లులు కూడా వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తూ ఉందన్నారు. ప్రభుత్వం జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి స్థలం లేని వారికి ఇంటి స్థలం మంజూరు చేసి గృహ నిర్మాణం కూడా మంజూరు చేస్తుందన్నారు. మండలానికి 962 గృహాలు మంజూరు కాగా ఇప్పటివరకు 287 గృహాలు పూర్తయ్యాయన్నారు. 72 గృహాలు పైకప్పు దశలో ఉన్నాయని, 110 గృహాలు లబ్ధిదారులు చేపట్టిన నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వెల్లడించారు.

జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలో జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారిని కె.సునీత తెలిపారు. వేల్పనూరు మరియు రేగడ గూడూరు గ్రామాల్లో జొన్న పంట వేసిన రైతులతో బుధవారం ఆమె సమావేశం ఏర్పాటు చేసి జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు గురించి తెలియజేయడం జరిగింది. జొన్నకు కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2970 ఇవ్వడం జరుగుతుందని. రైతులకు కొనుగోలు సమయంలో గోనె సంచులు, హమాలీ కర్చులు అన్ని ప్రభుత్వమే భరిస్తుందని, నేరుగా పొలం దగ్గరికే వచ్చి పంటను కొనుగోలు చేస్తారని, కొనుగోలు చేసిన తర్వాత రైతు బ్యాంకు ఖాతాకు తొందరలో చెల్లింపులు చేస్తారని తెలియజేశారు. కావున రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు నాగ శివ సాయి , సుధారాణి, వ్యవసాయ సహాయకురాలు లక్ష్మీ ప్రసన్న ,ఉద్యాన సహాయకురాలు, రూప ,ఎంపీ ఓ, ముర్తుజావలి పాల్గొనడం జరిగింది.

తండ్రి ఆటో డ్రైవర్ కూతురు ఎంబీబీఎస్ డాక్టర్

విశాలాంధ్ర - శిరివెళ్ళ: మండల కేంద్రంలోని ఒక సాధారణ ఆటో డ్రైవర్ కూతురు ఎంబీబీఎస్ డాక్టర్ గా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ఆటో డ్రైవర్ షేక్ హకీం బాషా పెద్ద కూతురు షేక్ అమ్తుల్ మతీన్ ఎల్కేజి నుంచి ఐదో తరగతి వరకు,ఆరు ఏడో తరగతి కే జి బి వి లో, ఎనిమిది నుంచి పది తరగతి వరకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తర్వాత ఇంటర్మీడియట్ హైదరాబాద్ లో మరియు కడప లోని ఫాతిమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఈ సందర్భంగా శిరివెళ్ళ లో మొట్ట మొదటి సారిగా ఒక మహిళ ఎంబిబిఎస్ పూర్తి చేయడం గర్వం కారణం అని పలువురు ప్రముఖులు మరియు గ్రామ ప్రజలు షేక్ హకిం బాషా గారిని ఆయన కూతురు ఎంబిబిఎస్ డాక్టర్ షేక్అమ్తుల్ మతీన్ గారికి అభినందనలు తెలియజేశారు.

వివాహ వేడుకల్లో బీసీ బ్రదర్స్

విశాలాంధ్ర - బనగానపల్లి : పట్టణంలోని జిఎంఆర్ ఫంక్షన్ హాల్ నందు బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామానికి చెందిన బాణా నారాయణరెడ్డి కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్దన్ రెడ్డి, పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి. ఈ కార్యక్రమంలో లక్ష్మి కాంత్ రెడ్డి, శేషారెడ్డి, పుల్లారెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, పట్టభద్రుల సమస్యలపై పోరాడే అభ్యర్థులనే గెలిపించండి

విశాలాంధ్రబీ-బేతంచెర్ల రూరల్ పశ్చిమ రాయలసీమలో ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి నెల 13వ తేదీ జరగనున్న తరుణంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయుల ఆత్మ గౌరవానికి ప్రతీక అని దానికై ఉపాధ్యాయుల అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి,పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు లకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి ఉద్యమకారులను ఎమ్మెల్సీలుగా ఎన్నుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్ బాబు,సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్,సిపిఎం జిల్లా నాయకులు ఎల్లయ్య, సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శులు భార్గవ్ ఈశ్వరయ్య, వ్యకాస జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తిరుమలేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ ల ఆధ్వర్యంలో కొత్తపల్లి,రంగాపురం సిమెంట్ నగర్ గోరుమానుకొండ గ్రామాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి పోతుల నాగరాజు ల గెలుపునకై ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ రాయలసీమ ప్రాంతమైన కడప,కర్నూల్,అనంతపురం,నంద్యా,సత్యసాయి,రాయచోటి జిల్లాలోని ఉన్న ఉపాధ్యాయ,పట్టభద్రుల మేధావుల ఆత్మగౌరవానికి ప్రతీక అని,ఎన్నికల్లో అవినీతి అక్రమాలు చేసే వ్యాపారస్తులు, ఉపాధ్యాయులు కాని వారు ఎన్నారై అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రతినిధులు వీళ్లందరినీ ఓడించే గురుతర బాధ్యత

ఉపాధ్యాయులు,మేధావులైన పట్టభద్రుల పైన ఉన్నదని గుర్తు చేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలు వామపక్ష భావజాలానికి,అధికారపక్ష అహంకారానికి మధ్య జరుగుతున్నాయని తాత్కాలిక తాయిళాలు మరియు శాశ్వత ప్రయోజనాల మధ్య జరుగుతున్నాయని సమాజానికి ఏవి అవసరమో మేధావులు పట్టభద్రులు ఉపాధ్యాయులు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు వైబి వెంకటేశ్వర్లు,సురేంద్ర,శ్రీకర్,దేవరాజు,శివ,తదితరులు పాల్గొన్నారు.

రుణాలతో జీవనోపాధి పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - పాణ్యం : పొదుపు రుణాలతో మహిళలు జీవనోపాదులు పెంపొందించుకోవాలని ఏపీఎం ప్రసాద్ అన్నారు.. గురువారం స్థానిక మండల మహిళా సమాఖ్య ఆఫీస్ నందు ఏపిఎం ప్రసాద్ ఆధ్వర్యంలోమండల సమాఖ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ప్రతి గ్రామం నుండి గ్రామ సంఘం అధ్యక్షురాలు మరియు గ్రామ సంఘం లు హాజరు కావడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగ ఏరియా కోఆర్డినేటర్ బాబురావు హాజరు కావడం జరిగింది. ఈ సమావేశంలో ఏపిఎం మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సంఘం సమావేశం తప్పక నిర్వహించవలెను అంతేకాకుండా ప్రతి చిన్న సంఘం సమావేశానికి వివోఏ తప్పకుండా హాజరుకావాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి స్కూల్లో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమాన్ని గ్రామ సంఘం అధ్యక్షులు తనిఖీ చేయవలసిందిగా తెలిపారు. ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సరళమ్మ,రవి కుమార్, సీసీలు రఘురాం, పుల్లన్న, బాలస్వామి, మేరీ మరియు అన్ని గ్రామాల గ్రామ సంఘం అధ్యక్షులు వివో ఏలు హాజరయ్యారు.

ఓపెన్ ఇంటర్ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - శిరివెళ్ళ: మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో గల గంగుల తిమ్మారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియట్ చదవడానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్ చదివి మధ్యలో ఆపేసిన విద్యార్థులకు ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణ అవకాశాన్ని అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల ఫిబ్రవరి 27వ తేదీలోగా ఆన్లైన్లో వెబ్సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకుని దరఖాస్తులు యర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందజేయాలన్నారు.

రైతులకు నష్టపరిహారం వచ్చేలా కృషి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : రైతులు నష్టపోయిన జొన్న పంటకు నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గం లోని దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి చెందిన జాకీర్,నాగేంద్ర అనే రైతులు 7 ఎకరాల్లో సాగుచేసిన జొన్న పంటను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి దగ్ధం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం గ్రామానికి చేరుకుని దగ్ధమైన జొన్న పంటను పరిశీలించారు . ఈ సందర్భంగా పంట నష్టాన్ని అంచనా వేయమని అధికారులను ఆదేశించారు. నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే రైతులకు హామీ ఇచ్చారు. పంట నష్టానికి కారణమైన దుండగులను కనుక్కొని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫోన్లో పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్లాల వద్దనే ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల రైతులు రబీ సీజన్లో పండించిన జొన్న పంట దిగుబడులను ప్రభుత్వ మద్దతు ధరకు కల్లాల వద్దనే కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలియజేశారు. ఆయా గ్రామాల రైతులు తమ పరిధిలో ఉన్నటువంటి రైతు భరోసా కేంద్రంలో రైతు పేరు నమోదు చేసుకొవలని సూచించారు. జొన్న పంట దిగుబడులను కొనుగోలు నందు ప్రభుత్వము రైతులకు హమాలీ ఖర్చులు, రవాణా ఖర్చులు ,గోనె సంచులు ఇవ్వడం జరుగుతుందని, ఇప్పటికే గుంపరమందిన్నే రైతు భరోసా కేంద్రంలో 1000 క్వింటాలకు అలాగే జీనేపల్లి రైతు భరోసా కేంద్రంలో 600 క్వింటాలకు రైతులు వారి యొక్క పేరును నమోదు చేసుకున్నారనీ వివరించారు. వాటిని రెండు లేదా మూడు రోజులలో నాణ్యతా ప్రమాణాలను ఆధారంగా 2970 రూపాయల మద్దతు ధర తో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

24న క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణ సీనియర్ క్రికెట్ ఆటగాడు ఎస్ మహమ్మద్ గౌస్ జ్ఞాపకార్థం పార్టీ గ్రూప్ ఆధ్వర్యంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 25వ నుండి నిర్వహించడం జరుగుతుంది తెలిపారు. కావున ఈ టోర్నమెంట్లో పాల్గొను జట్లు 24వ తేదీలోగా 800 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ టోర్నమెంట్లో గెలుపు పొందిన జట్టుకు మొదటి బహుమతి 20,000 రూపాయలు, రెండవ బహుమతి 10,000 రూపాయలు,మూడవ బహుమతి 5,000 రూపాయలు బహుమతి దాతగా ఎస్.మహేమూద్ మరియు ప్రతి ఒక్క మ్యాచ్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ,మ్యాన్ ఆఫ్ ది సిరీస్, దాతగా టిడిపి రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహిద్ హుస్సేన్ , గెలుపు పొందిన జట్లకు కప్పులను ప్రముఖ న్యాయవాది ఖాజా హుస్సేన్ సాహెబ్‌లు అందించడం జరుగుతుందన్నారు. తమ పేర్లను నమోదు చేసుకొనుటకు ఈ నెంబర్లను సంప్రదించ వలనని నిర్వాహకులు తెలిపారు. 9885569450, 7093737801,9160271127

చేతల్లో చేసి నిరూపించిన సీఎం జగన్

విశాలాంధ్ర - నంద్యాల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చట్ట సభల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అత్యధిక శాతం సీట్లను కేటాయించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారని రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ పీ పీ నాగిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బీసీ,ఎస్సీ ,ఎస్టీ ,మైనార్టీ వర్గాలకు చట్టసభల్లో అత్యధిక శాతం కేటాయించి అధికారాన్ని కట్టబెట్టారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో చేసి నిరూపించాడన్నారు. రాష్ట్రంలో చట్టసభలోనే కాకుండా స్థానిక సంస్థలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్, వివిధ నామినేటెడ్ పదవులను కూడా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ వర్గాలకు అధిక ప్రాధాన్యతను కల్పించి సామాజిక న్యాయాన్ని పాటించారని తెలిపారు. రాష్ట్రం కరోనా నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితుల్లో కూడా పేద బడుగు బలహీన ప్రజలకు అండగా నిలిచి వారి ఆర్థిక భరోసాకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు సోమశేఖర్ రెడ్డి, కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుముడులు కట్టుకున్న మాలాధారులు

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం నరసింహస్వామి మాలాదారలు ఇరుముడులు కట్టుకున్నారు. స్థానిక చెన్నకేశవ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి నరసింహప్రసాదు ఆధ్వర్యంలో గురువారం ఆలయంలో 57 మంది నరసింహస్వామి మలాధారలకు ఇరుముడులను కట్టారు. ఈనెల 24 ఉదయం ఇరుముడులతో ఆహోబిళం పాదయాత్ర చేపడతామని నరసింహ మాలాధారులు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండయ్య, లక్ష్మీనరసింహస్వామి సేవా సంఘం అధ్యక్షులు గుత్తినరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ట్రైబుల్ స్కూల్ వార్డెన్ పై విచారణ చేసి సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - పాణ్యం : ట్రైబల్ స్కూల్ వార్డెన్ వెంకటేశ్వరమ్మపై విచారణ చేసి సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంద్యాల జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రి స్వామిలు మాట్లాడుతూ స్థానిక పాణ్యం మండలం కేంద్రంలో ఉన్న ట్రైబల్ స్కూల్ వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరమ్మ సక్రమంగా విధులకు హాజరు కాకుండా, మెనూలో ఉన్న గుడ్లు,అరటి పండ్లు,చికెన్,చపాతి,పూరి పెట్టకుండా వంటకు వాడే కూరగాయలు అన్ని కుళ్ళిపోయినవి ఇస్తుందన్నారు. విద్యార్థులు అన్నం తినే సమయంలో అంత అన్నం తింటారా, మీ ఇండల్లో ఇలాగే తింటారా, అంటూ కాళ్లతో తన్నుతూ విద్యార్థులను అసభ్యకర పదజాలంతో మాట్లాడుతున్న విషయాన్ని విద్యార్థులు నేరుగా ఏఐఎస్ఎఫ్ నాయకత్వం కు చెప్పడం జరిగిందని వారు తెలిపారు. విద్యార్థులపై ఎందుకు ఇలా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అడగడానికి వస్తే నేను ఇలాగే ఉంటాను ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోమని బెదిరింపులకు దిగుతున్న వార్డెన్ వెంకటేశ్వరమ్మ ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు

అధికారులను డిమాండ్ చేశారు. అంతేకాకుండా విద్యార్థులకు మెనూ సక్రమంగా పెట్టడం లేదని విద్యార్థులు అడిగితే వారిని బెదిరించడం, కొట్టడం లాంటి ఘటనలు జరగబట్టి ఇప్పటికీ మూడోసారి అయినప్పటికీ డిటీడబ్ల్యూఓ ఉస్సేనయ్య గారు ఎందుకు హాస్టల్ ను తనిఖీ చేయలేదని,ఎందుకు వార్డెన్ పై చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. . ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, రమణ, చందు,శేఖర్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

డయాబెటిస్ నివారణకు లయన్స్ సంస్థ, ఐఎంఏ ఒప్పందం

విశాలాంధ్ర - నంద్యాల : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాలలో డయాబెటిస్ వ్యాధి గుర్తింపు, నివారణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థకు అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లయన్స్ డయాబెటిస్ ఫౌండేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ నంద్యాలలో ఒప్పందం చేసుకున్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ లయన్స్ సేవా సంస్థ రాష్ట్ర నాయకుల రెండు రోజుల సదస్సు నంద్యాలలో జరుగుతున్న సందర్భంగా అంతర్జాతీయ లయన్స్ సేవా సంస్థ ఫౌండేషన్ ప్రతినిధి, మాజీ లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయకుమార్ రాజు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ఈ సందర్భంగా డయాబెటిస్ గుర్తింపు, నివారణ, అవగాహన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడం కోసం కలిసి పని చేయాలని పరస్పర ఒప్పందం చేసుకుని పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ముఖ్యఅతిథిగా లయన్స్ మల్టిపుల్ చైర్మన్ అనిల్ కుమార్ శెట్, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫరుల్లా గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డయాబెటిస్ అవగాహన నడక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ డయాబెటిస్ వ్యాధి విస్తృత స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో నివారణ చర్యలు ముఖ్యంగా అవగాహన కార్యక్రమాలు, వ్యాధి నిర్ధారణ శిబిరాలు నిర్వహించి దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. లయన్స్ జిల్లా గవర్నర్లు రామచంద్ర ప్రకాష్, గోపీచంద్, మంగతాయారు, ఉషా రాజు, పంకజాక్షన్, ఏవిఆర్ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, శివశంకర్, వేమా కోటేశ్వరరావు, ఉపేంద్ర, అధిక సంఖ్యలో నంద్యాల లయన్స్ సభ్యులు, ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల ఆట కట్టిస్తాం

విశాలాంధ్ర - డోన్ రూరల్: అ సాంఘిక శక్తుల ఆట కట్టిస్తామని టౌన్ సిఐ పెనుగొండ శేషయ్య అన్నారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో గురువారం శేషయ్య మీడియాతో మాట్లాడుతూ అ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ముఖ్యంగా పట్టణంలో ఇతర రాష్ట్రాల మద్యం, మట్కా జూదం, సెల్ ఫోన్ దొంగతనాలు ఎక్కువగా ఉండడమే కాకుండా ఆకతాయిలు అల్లరి మూకలు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని అటువంటి వారు తీవ్ర పరిమాణాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. కాలేజీల వద్ద ఆకతాయిలు విద్యార్థినులు మహిళల పట్ల అతిగా ప్రవర్తిస్తే పోలీసులు తమదైన శైలిలో బుద్ధి చెబుతారని, అలాగే అల్లరి మూకలు గ్రూపులుగా ఏర్పడి శాంతి భద్రతలకు విఘాతం కలిగించినట్లయితే ఊరుకునేది లేదని, కొంతమంది బడా రాజకీయ నాయకులు పేకాట శిబిరాల నిర్వహణ కూడా తమ దృష్టికి వచ్చిందని అటువంటి వారిపై ఉక్కు పాదం మోపుతామని తెలిపారు. అలాగే పట్టణంలోని యువకులు, చదువుకునే విద్యార్థులు సరియైన పద్ధతిలో నడవడికలు ఉండేటట్లు చూసుకోవాలని చింపిరి జుట్టు కలిగి ఉన్న వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారని అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. హొటల్ ల యందు మద్యం సేవించడం అమ్మడం, కూల్ డ్రింక్ షాప్ ల యందు మద్యాన్ని సేవింప చేయడం కూడా నెరమేనని అన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం అక్రమంగా తీసుకుని వచ్చి అక్రమ అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాల వంటి వాటికి అడ్డుకట్ట వేస్తామని అన్నారు. ఇప్పటికే పలు అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందని మరో మారు అక్రమాలకు పాల్పడ్డారని తమ దృష్టికి వచ్చినట్లయితే పరిణామాలు తీవ్రంగా ఉండడమే కాకుండా కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. యువకులు అతి వేగంతో పెద్ద శబ్దంతో ద్విచక్ర వాహనాలను నడిపినట్లయితే లైసెన్సు రద్దు చేయించి కేసులు పెడతామని ఇటువంటి అల్లరి ఆకతాయి, శాంతి భద్రతలకు భంగం కలిగించే వారి భరతం పడతామని శేషయ్య హెచ్చరించారు.

పోతుల నాగరాజును గెలిపించండి

విశాలాంధ్ర - బనగానపల్లి : పీడీఎఫ్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని బీసీ సంఘం నాయకులు పాండురంగ యాదవ్ అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజకవర్గం కన్వీనర్ మద్దయ్య యాదవులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో కార్యాలయాల్లో ప్రైవేట్ పాఠశాలలు ప్రైవేట్ కార్యాల యాల్లో బిసి సంఘం యాదవ సంఘం, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. . యాదవ సంఘం మండల అధ్యక్షులు ఎర్రగుడి గణ మద్దిలేటి యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి రాళ్ల కొత్తూరు శంకర్ యాదవ్ ,నాయకులు పిల్లి నాగయ్య యాదవ్, సాదుకొట్టం మహేష్ యాదవ్ ,దాట్ల జానకిరామ్ యాదవ్ గంగినేని సుధాకర్ యాదవ్, లింగాల కుమార స్వామి, శ్రీరాములు యాదవ్, వెంకటసుబ్బయ్య, నాగరాజు, గురు శేఖర్, బాల ఆంజనేయులు, బీసీ సంఘం ,యాదవ సంఘం, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రహల్లాద్‌కు జాతీయ పురస్కారం

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : నంద్యాల ప్రాంతానికి చెందిన ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ సభ్యులైన బాయికాటి ప్రహల్లాద కు విస్డం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇండియన్ ఐకాన్ హైదరాబాద్ నేషనల్ జాతీయ పురస్కారం లభించినట్లు గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు చేయడం జరిగిందన్నారు. అలాగే 1996లో రాజీవ్ గాంధీ హెల్త్ సెంటర్ స్థాపించి మండలంలోని పివి నగర్, కానాల, చాబోలు, అయ్యలూరు గ్రామాలతో పాటు అన్ని గ్రామాల ప్రజలకు 20 సంవత్సరముల నుంచి వైద్య సేవలు చేస్తున్నామన్నారు. ప్రధానంగా కరోనా సమయంలో సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి నిత్యవసర సరుకులు, మాస్కులు మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కాగా ఏపీ శానిటారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇప్పటికీ కూడా విద్య, వైద్యంతోపాటు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన అన్నారు. అందువల్ల ట్రస్టు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి చేసిన సేవలకు గుర్తింపుగా నన్ను ఎంపిక చేసి నేషనల్ అవార్డు ఇచ్చినందుకు ట్రస్ట్ డైరెక్టర్ హనుమంత్ల నాగరాజు, అశ్విని కుమారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డుతోపాటు శాలుతో సన్మానించారు.

నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - రుద్రవరం : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న నాడు నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు దృష్టి సారించాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగుల వరం, నరసాపురం గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ 100% హాజరును నమోదు చేయాలన్నారు. అలాగే ఆయా శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనుల నివేదికలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

పదిలో అందరూ ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు అందరూ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాధికారి జిలాని భాష అన్నారు. గురువారం మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ సీనియర్ ఉపాధ్యాయుడు బాలసుబ్బారెడ్డిలతో కలిసి పదవ తరగతి విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. 10లో ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు పలు మెలకువలు సూచించారు. విద్యార్థులను ప్రావీణ్యులుగా తీర్చిదిద్దేల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రభుత్వం సూచించిన మెనూ పాటించాలని ఏజెన్సీ వారిని ఆదేశించారు. వీరి వెంట ఎమ్మార్సీ సిబ్బంది కాంతారావు తదితరులు ఉన్నారు.

బహిరంగంగా టెంకాయల వేలం

విశాలాంధ్ర- ప్యాపిలి : మండల పరిధిలోని రాచర్ల గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మి కంబగిరి స్వాముల దేవాలయంలో బహిరంగంగా టెంకాయల వేలం జరుగుతుందని దేవాలయ శాఖ ఈవో నాగరాజు తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది లక్ష్మి కంబగిరి స్వాముల కల్యాణోత్సవం జరుగుతుందని కావున మార్చి రెండున టెంకాయల వేలం జరుగుతుందని కావున ఎవరైనా కాంట్రాక్టర్లు వేలం పాట పాడవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

విశాలాంధ్ర - నంద్యాల : పట్టణంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన చోటుచేసుకుంది. గురువారం ఉదయం రైల్వే స్టేషన్ రహదారి నౌమాన్ నగర్ బిఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర శివ అనే వ్యక్తి రామకృష్ణపై కత్తితో వ్యక్తిపై దాడి చేసినట్లు సమాచారం. వివరాల్లోకెళితే ఓంకారంలోని అన్నసత్రంలో వంట మాస్టర్లుగా పని చేస్తున్న ఇరువురు చట్నీ వద్ద చోటు చేసుకున్న ఘర్షణ కత్తితో దాడి చేసుకునే వరకు వచ్చింది. ఓంకారంలో గొడవ జరగడంతో అక్కడ ఉన్న నిర్వాహకులు సర్ది చెప్పి రామకృష్ణను తన ఊరు ప్రకాశం జిల్లా కంభంకు పంపించారు. నంద్యాలకు చేరుకున్న రామకృష్ణను అనుసరించిన శివ రైల్వే స్టేషన్ వద్దకు చేరుకోగానే రామకృష్ణ ముఖంపై కత్తితో దాడి చేసినట్లు సమాచారం. గమనించిన స్థానికులు అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 24, ఫిబ్రవరి 2023

గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని గంగాభవానిదేవీ క్షేత్ర పీఠాధి పతులు శ్రీబసలింగమ్మ అన్నారు. గురువారం మండల పరిధిలోని బాపురంలో వెలసిన శ్రీ గంగాభవానిదేవీ రథోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ లో భాగంగా కబడ్డీ పోటీలను పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మ, ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కబడ్డీ టోర్నమెంట్ లో విజేతగా నిలిచిన ప్రథమ జట్టుకు రూ. 20 వేలు, ద్వితీయ జట్టుకు 15 వేలు, తృతీయ జట్టుకు 10వేలు, నాల్గవ జట్టుకు 2 వేలు ప్రోత్సాహక బహుమతులుగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యల్లప్ప, వైసీపీ నాయకులు హనుమంతరెడ్డి, బొడ్డన్న, మహదేవ తదితరులు పాల్గొన్నారు.

నటనలో మేటి తిమ్మారెడ్డి యాదవ్

విశాలాంధ్ర - హొళగుంద : మండలంలోని ముద్దటమా గి లో మహాశివరాత్రి సందర్భంగా కృష్ణార్జున యుద్ధం అనే కన్నడ బయలు నాటక ప్రదర్శనం జరిగింది. బయలు నాటక ప్రదర్శనలో వికలాంగుడు టీడీపీ సీనియర్ యువ నాయకుడు జి తిమ్మారెడ్డి యాదవ్ తమ యాదవ కులస్తుల ఆరాధ్య దైవంగా భావించే శ్రీకృష్ణుని పాత్రను వేసి నటనలు మేటిగా నిలిచారు .వ్యవసాయ పొలం పనులు బిజీగా ఉండడమే కాక పార్టీలో చురుకైన నాయకుడిగా ఉంటూ వికలత్వాన్ని లెక్కచేయకుండా శ్రీకృష్ణుని పాత్రను వేసి ప్రజలకు ఎంతో ఆకట్టుకున్నారు. కన్నడ బయలు నాటక ప్రదర్శనలు శ్రీకృష్ణ వేషాధారణతో తిమ్మారెడ్డి నటించడంతో ప్రజలు అభిమానులు అభిమానంతో రాత్రి భారీగా బాణాసంచాలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ యువ నాయకుడు జి తిమ్మారెడ్డి యాదవ్ శ్రీకృష్ణుని వేషాదరణతో నటించినందుకు ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ఉంగరాన్ని బహుమతిగా ప్రధానం చేసి ప్రోత్సహించారు .భవిష్యత్తులో తిమ్మారెడ్డి కళా రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వారికి సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని కోట్ల సుజాతమ్మ పేర్కొన్నారు.టీడీపీ యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ,రఘు ప్రసాద్ రెడ్డి ,మహమ్మద్ ,ఆదం, స్థానిక టిడిపి నాయకులు శ్రీకృష్ణ వేషధారణలో ఉన్న తిమ్మారెడ్డికి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

అవినాష్‌కు "యోగా చార్య" అవార్డు ప్రధానం

విశాలాంధ్ర - కర్నూలు : బెంగళూరులో జరుగుతున్న 1వ అంతర్జాతీయ యోగా ఫెస్టివల్ లో భాగంగా కర్నూలు జిల్లాకు చెందిన యోగ శిక్షకుడు, జిల్లా కార్యదర్శి అవినాష్ శెట్టికి "యోగా చార్య "అవార్డును కన్నడ ప్రముఖ సినీ నటి రచన, బెంగళూరు ఏసీపీనారాయణస్వామి,సిఎఫ్ఎ విజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు,రాష్ట్ర యోగ సంఘం చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి,న్యాయవాది శ్రీధర్ రెడ్డి, జిల్లా యోగా సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర- పత్తికొండ: పశ్చిమ రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి పత్తికొండ, తుగ్గలి, మద్దికేర, మండలాల వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసి లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో విద్యావంతులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి, వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపిం చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, జడ్పిటిసి ఉరుకుందమ్మ, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, జిల్లా ప్రధాన కార్యదర్శి లలితా రామ చంద్ర, మూడు మండలాల వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండల కన్వీనర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో ఉచిత వైద్య శిభిరం

విశాలాంధ్ర -గూడూరు : పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ ఖలీల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ చైర్మన్ పిఎన్ అస్లాం పాల్గొన్నారు. కర్నూలు పట్టణంలోని జి. పుల్లారెడ్డి దంత వైద్యశాల నుండి వైద్యులు వైద్య కేంద్రానికి తరలివచ్చి వైద్య సేవలను అందించారు. పట్టణంలోని పలువురికి వైద్య సేవలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. వ్యాధి తీవ్రతను బట్టి వారిని కర్నూలు ఆసుపత్రికి రెఫర్ కార్యక్రమంలో రెండవ వైస్ చైర్మన్ లక్ష్మన్న కౌన్సిలర్ మద్దిలేటి నాయకులు అభిబ్ ఇటుకల షేక్షావలి షేక్షా మరియు స్థానిక వైసీపీ నాయకులు వైద్య కళాశాల బృందం సభ్యులు పాల్గొన్నారు.

మినీ గోకులం డబ్బులు వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రభుత్వం రైతులకు మినీగోకులం డబ్బులు వెంటనే విడుదల చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాధం డిమాండ్ చేశారు. గురువారం సీఆర్‌భవన్‌లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తో రాష్ట్ర ప్రభుత్వం ఊరూరా పశుగ్రాసం పథకాన్ని ప్రారంభించిందన్నారు. పాడి పరిశ్రమను ప్రోత్సహించాలని ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. జిల్లాలో 7వేల ఎకరాలలో 5000మంది రైతులు ఈ పథకం ద్వారా పశుగ్రాసం పెంచారు. ప్రభుత్వ అధికారులు చెప్పిన మాటలు నమ్మి పశుగ్రాసం పెంచితే వైసీపీ ప్రభుత్వం వీరికి నిధులు విడుదల చేయడం లేదు. గత ప్రభుత్వం చేపట్టిన పథకాలను రాజకీయ కక్షతో అమలు చేయడం లేదని దీనివల్ల రైతులు నష్టపోతు న్నారని ఆరోపించారు. రైతులు కోర్టుకు పోతే 50మంది రైతులకు మాత్రమే డబ్బులు విడుదల చేశారు. ఇంకా 4450 మంది రైతులకు డబ్బులు విడుదల చేయాల్సి ఉందన్నారు. మినీ గోకులం పథకం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టారు. జిల్లాలో 5వేల మంది రైతులు షెడ్లు నిర్మించారు. ఒక్కొక్క షెడ్‌లో 6పాడి పశువులు ఉండాలని పాడి పరిశ్రమను పెంచాలని అధికారులు చెప్పారు. అధికారులు చెప్పిన విధంగా గ్రామాలలో రైతులు పశువులకు షెడ్లు నిర్మిస్తే ఇంతవరకు పాలకులు నిధులు విడుదల చేయడం లేదు. రైతులు అప్పులు చేసి పథకాన్ని అమలు చేస్తే రాజకీయ కక్షతో పగసాధింపుతో ఈ పథకాన్ని వైయస్ జగన్మోహన్ రెడ్డి అర్ధాంతరంగా నిలుపుదల చేశారు. ఇరు పక్షాల రాజకీయ నాయకుల మధ్య పేద రైతులు నలిగిపోతున్నారు. 180000 వేల రూపాయలు ఖర్చు పెట్టి రైతులు నిర్మించారు 9,000కోట్ల రూపాయలు పశుగ్రాసం పథకానికి, 60కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలి. రైతు ప్రభుత్వమని, రైతు రాజ్యమని,రాజన్న రాజ్యం అని చెప్పి గద్దెనెక్కిన తరువాత రైతుల నోట్లో మట్టి కొడుతున్నారు. తక్షణమే డబ్బులు విడుదల చేయాలని, రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.కృష్ణ, నరసింహులు,నాగరాజు, మహేష్,కుళ్లాయప్ప, వెంకటేశ్వర్లు,జనార్దన్ రెడ్డి, ఖాసిం,మంత్రాలయం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పతనం తప్పదు

విశాలాంధ్ర - వెల్దుర్తి : రానున్న ఎన్నికల్లో వైకెపాకు పతనం తప్పదని 2024లో టీడీపీ విజయ ధంకా మోగిస్తాదని టిడిపి మండల

అధ్యక్షులు టి. బలరాంగౌడ్ అన్నారు. గురువారం టీడీపీ కార్యాల యంలో సీనియర్ నాయకులు బొమ్మన శివ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టి.బలరాం గౌడ్ మాట్లాడుతూ కృష్ణాజిల్లా గన్నవరం ఎమ్మెల్యే వంశీ వర్గీయులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై, పార్టీ ఆఫీసుపై దాడి చేసి టీడీపీ నాయకులపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు.పత్తికొండ నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి శ్యాంబాబు రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో చిన్నగోపాల్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ అజయ్, వీరభద్రుడు ,బజారు, మెకానిక్, నారాయణ,సూర్యచంద్ర నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాలు పెంచండి

విశాలాంధ్ర - కౌతాళం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రమైన శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు తమ జీతాలను పెంచాలని సహాయ కమిషనర్ వాణిని కోరారు. గురువారం సాయంత్రం ఒప్పంద ఉద్యోగస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ దేవస్థానంలో48 మంది ఒప్పంద ఉద్యోగులు పనిచేయడం జరుగుతుందన్నారు. అయితే అందులో ఐదు మందికి దేవస్థానం యొక్క ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని జీతాలు జరిగిందని వివరించారు. మిగతా ఉద్యోగస్తులు తమకు కూడా జీతాలు పెంచి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. నిత్యవసర సరుకులు ధరలు పెరిగిపోతుండడంతో జీతాలు చాలడం లేదని తమపై దయ చూపాలని అన్నారు. సహాయ కమిషనర్ వాణి మాట్లాడుతూ త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి ప్రతి ఒక్కరికి జీతాలు పెంచడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సూపర్డెంట్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ విషయంపై పాలకమండలి చైర్మన్ నాగరాజు గౌడ్ వివరణ కోరగా సిబ్బందికి జీతాలు పెంచే విషయం పాలకమండలి కమిటీ దృష్టికి రాలేదన్నారు. దేవాలయ అభివృద్ధి, సిబ్బంది విషయంలో సహాయ కమిషనర్ మండలి కమిటీని సంప్రదించకుండా సొంత నిర్ణయాలు తీసుకోవడం చాలా విచారకరమన్నారు . సహాయ కమిషనర్ తీరుపట్ల సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

క్రోమా మ్యాజికల్ సమ్మర్‌తో మ్యాజిక్‌ను తెరవండి

విశాలాంధ్ర -కర్నూలు లీగల్ : ప్రతి ఒక్క వినియోగదారుడు క్రోమా మ్యాజికల్ సమ్మర్‌తో మ్యాజిక్‌ను తెరవాలని ఎయిర్ కండీషనర్స్, రిఫ్రిజిరేటర్స్, రూమ్ కూలర్స్‌పై 45% వరకూ ఆదా చేసుకోవచ్చని స్పష్టం చేశారు. స్ప్లిట్ ఏసీలు రూ.27,990ల నుంచి ప్రారంభ మవుతాయని తెలిపారు. భారత దేశపు మొట్టమొదటి , ఓమ్నీ ఛానెల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్, టాటా గ్రూప్‌కు చెందిన క్రోమా, తమ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తోన్న సమ్మర్ సేల్ ను ప్రకటించిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇది వినియోగదారులకు విస్తృత ఆఫర్లను హోమ్ అప్లయెన్సస్‌పై అందిస్తుందన్నారు.ఎండ వేడిమి ఈ సారి ఎక్కువగా ఉంటుందనే అంచనాలతో పాటుగా ఈసారి ఎండలు కూడా ముందే రావడం, ఉక్కబోత ఉష్ణోగ్రతలు వంటివి ఈ వేసవి అమ్మకాలతో తమ ఇళ్లను ఎండ వేడిమి అధిగ మించేందుకు సిద్ధమయ్యేలా చేసేందుకు తోడ్పడతాయని వెల్లడించారు.వినియోగదారులు 350కు పైగా ఏసీలు, 450 కు పైగా రిఫ్రిజిరేటర్లను ఎక్స్చేంజ్ మరియు అప్‌గ్రేడ్ ప్రయోజనాలు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, 18 నెలల ఈఎంఐ అవకాశాలతో పొందవచ్చని తెలిపారు. వినియోగ దారులను దృష్టిలో పెట్టుకొని స్ప్లిట్‌ఏసీలు కేవలం రూ 27,990 ల నుంచి ప్రారంభంకాగా, రూమ్ కూలర్లు రూ.5,990 లు, క్రోమా ఫ్రాస్ట్ ఫ్రీ రిఫ్రిజిరేటర్లు రూ.21,990 లతో ప్రారంభమవుతాయని పేర్కొ న్నారు. ఈ వేసవిలో క్రోమా యొక్క సాటిలేని డీల్స్, రాయితీ లతో ఎండ వేడిమిని అధిగమించాలని వారు కోరారు.

ఉన్న ఊరు వెళ్ళమంది .... పరాయి ఊరు రమ్మంది

విశాలాంధ్ర - కర్నూలు : గ్రామాలలో వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమును ప్రవేశపెట్టినప్పటికీ గ్రామాలలో ఉపాధి కరువై ఇతర గ్రామాలకు వలసలు వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోయారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పరిధిలోని అటేకలు గుండు గ్రామం నుండి దాదాపు 100 మంది దాకా ఉపాధి కొరకు అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గంలోనే గడేకల్ గ్రామమునకు మిర్చి పంట కోత పనులు కొరకు వెళ్లడం జరుగుతుందని మండల కేంద్రమైన చిప్పగిరి లోనే విశాలాంధ్రకు తెలియజేశారు. ఉన్న ఊరిలో పొలాలు పనులు పూర్తి కావడంతో ఎలాంటి పనులు లేకపోవడంతో కుటుంబాలను పస్తులు ఉంచలేక వలసలు వెళ్లక తప్పడం అన్నారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు ఉన్నప్పటికీ ఆ పనులు ఎవరికి కల్పిస్తున్నారో కూడా తెలియడం లేదని కనుక కుటుంబాల జీవన ఉపాధి కోసం ఉన్న ఊరు వెళ్ళమంది, పరాయి ఊరు రమ్మందని కూలీలు వాపోయారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి గ్రామాలలో

వలసలు వెళ్లకుండా నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందన్నారు.

పుస్తకాల గది తెరవని శాఖ గ్రంథాలయం

కేవలం దినపత్రికలకే పరిమితమైన గ్రంథాలయం

విశాలాంధ్ర - హొళగుంద : ఎన్నో ఏళ్ల నుండి నడుస్తున్న శాఖ గ్రంథాలయం సమస్యల సుడిలో చిక్కుకుంది .పక్కా భవనం లేక గ్రంథాలయం అదే గదుల్లో కొనసాగుతుంది. రెగ్యులర్ గ్రంథాలయ అధికారి ఉన్న ఆయన విధులకు ఎప్పుడు హాజరవు తారో ఎప్పుడు లేదో తెలియ కుండ పోయిందని ప్రజలు ఆరోపించారు. గ్రంథాలయంలో దాదాపు పదివేల పుస్తకాలు భద్రంగా ఉన్నప్పటికీ చదవాలన్న ఆశ ఉన్న నిరుద్యోగులకు పుస్తకాలు అందగా నిరాశతో వెనుతిరిగి వెళుతున్నారు. రోజు దినపత్రికల కోసమే గ్రంథాలయాన్ని స్వీపర్ చాకలి నాగరాజు తెరుస్తున్నారు. ప్రజలు దినపత్రికలను చదివి ఇంటి ముఖం పడుతున్నారు .స్వీపర్ నాగరాజు తోనే గ్రంథాలయం కొనసాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రంథాలయంలో ధార్మిక గ్రంథాలైన భగవద్గీత ,రామాయణం, బైబిల్ ,ఖురాన్ తో పాటు ఎంతో విలువైన పుస్తకాలు లభ్యంగా ఉన్నప్పటికీ పాఠకులకు అందకుండా పోయాయని ప్రజలు ఆరోపించారు .పుస్తకాల గదికి ఎప్పుడూ తాళం వేసి ఉంటుందని తమకు విలువైన పుస్తకాలు లభ్యం కాక విలువైన సమయాన్ని వృధా చేస్తున్నామని నిరుద్యోగ యువకులు కాళికా ప్రసాద్, ఫయాజ్ .రవీంద్ర నాథ్ వీరేష్ వాపోయారు. పక్కా భవనం లేక ఇరుకైన అద్దె గదిలోనే గ్రంథాలయం నడవడం వల్ల ఇబ్బందిగా ఉన్నదని ప్రజలు పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్. గ్రంథాలయ కార్యదర్శి చర్యలు తీసుకొని గ్రంథాలయ సమస్యలను తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

నేడు అభివృద్ధిపై సదస్సు

విశాలాంధ్ర - పత్తికొండ : భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)ఆధ్వర్యంలో పత్తికొండ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధిపై కీర్తిశేషులు కామ్రేడ్ చదువుల రామయ్య 31వ వర్ధంతి సందర్భంగా నేడు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండ పంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి ఎస్.రామాంజనేయులు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యలు హాజరవుతారని పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాలు, అఖిల పక్ష పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ఎన్నిక

విశాలాంధ్ర - దేవనకొండ : పంచాయతిరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులుగా మొగతాళ్ అరుణ్‌కుమార్‌ని వైఎస్సార్‌సీపీ ప్రకటించడం జరిగింది. మండలం పరిధిలోని తెర్నేకల్ గ్రామ సర్పంచుగా మొగతాల్ అరుణ్‌కుమార్ ఉన్నారు. జిల్లాలో సముచిత స్థానం కల్పించిన సిఎం, జిల్లా మంత్రికి అరుణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపాడు. గ్రామాభివృద్ధితోపాటు పలు సమ స్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

నేడే గంగాదేవి రథోత్సవం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మండల పరిధిలోని బాపురం గ్రామంలో వెలసిన గంగాదేవి రథోత్సవం ఆలయ పీఠాదిపతులు బసలింగమ్మ అవ్వ ఆధ్వర్యంలో శుక్రవారం జరగనుంది . సద్గురు ఉచ్చ బుడ్డప్ప తాత, మల్లప్ప తాత కృప ఆశీర్వాదములతో శ్రీ బసలింగమ్మ అవ్వ ఆధ్వర్యంలో స్వస్తి శుభకృత్ నామ సంవత్సరం పాల్గుణ మాసం పంచమి రోజున శ్రీ గంగాదేవి రథోత్సవం అశేష భక్తివాహిణి నడుమ వైభవంగా నిర్వహిస్తారు. ఉదయం గంటల నుంచి 9 గంటల వరకు అమ్మ వారికి మహా గణపతి పూజ, గంగాపూజ, మధ్యాహ్నం 12 గంటలకు గణారాధన, 2 గంటలకు కుంభతీర్థం, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు బసలింగమ్మ అవ్వ అమృత ఆశీర్వాదములతో రథోత్సవం, నందికోలసేవ జరుగుతుందని తెలిపారు. 25వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు గంగాదేవికి ఆకుపూజ, సాయంత్రం 5 గంటలకు గంగా గౌరిదేవి కళ్యాణ మహోత్సవం పరమ శివునితో మరియు రంగులాట జరగనుంది . సద్భక్తులు జాతర మహోత్సవంలో పాల్గొని గంగాదేవి దర్శన కృపాశీర్వాదము పొందాలని కోరారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రీసర్వే, భూ హక్కు పత్రాలు తదితర అంశాలపై అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా భూపరిపాలన ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కొన్ని జిల్లాలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ఇంకా పెండింగ్ లో ఉన్నాయని వాటికి గల కారణాలను సంబంధిత జిల్లా కలెక్టర్ లను అడిగి తెలుసుకొని, మార్చి 31 వ తేదీ లోపల పెండింగ్ లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేయాలని అన్నారు.. వెటరైజేషన్ పనులు మరియు విల్లేజ్ సర్వేయర్, విఆర్ఓ ల లాగిన్ లో డేటా ఎంట్రీస్ కూడా త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ లను ఆదేశించారు.. గ్రౌండ్ ట్రూతింగ్ చేసిన తర్వాత 9(2),10(2) నోటీసులు ఏమైనా వస్తే వాటిని త్వరితగతిన డిస్పోజ్ చేయాలన్నారు. అదే విధంగా ఓఆర్ఐ మ్యాప్ వచ్చినప్పటి నుండి సెక్షన్ 13 నోటిఫికేషన్ ఇవ్వడానికి ఎంత సమయం పడుతుందని అన్ని జిల్లా కలెక్టర్ ల వివరణ కోరగా 90 రోజుల సమయం పడుతుందని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్స్ అండ్ సర్వే ఎడి పవన్ కుమార్ పాల్గొన్నారు..

నేడే గుళ్యంలో జోడు రథోత్సవం

విశాలాంధ్ర - హాలహర్వి : మండలం పరిధిలో ఉన్న గుళ్లం గ్రామంలో శ్రీ శివశరణ గాదెలింగేశ్వర స్వామి రథోత్సవం గురువారం జరుగనుంది. శ్రీ గాదెలింగేశ్వర స్వామి జన్మస్థలం బళ్లారి జిల్లా గంగావతి తాలూకా మళ్లీ వస్కెరి గ్రామం. శుద్ధ ఏకాదశి నాడు శంకరప్ప శాంతమ్మ అను దంపతులకు జన్మించాడు. అతను గుల్లెం గ్రామానికి చేరుకుని గ్రామంలో పిచ్చివాడి లాగా వీధుల సందులో తిరిగాడు చూసిన ఒక పెద్ద మనిషి అతన్ని ఇంటికి తీసుకువెళ్లి వివరాలు కనుక్కొని అతనిని ఇంటిలో పెట్టుకున్నాడు. ఆ గాదెలింగప్ప ఇంట్లో ఉండడం వల్ల వాళ్లకు ఎంతో కలిసి వచ్చిందని ఆయన గ్రామాలలో ప్రచారం జరిగింది. గ్రామంలో ఎన్నో మహిమలు చూపిస్తూ కళ్ళు లేని వారికి కళ్ళు తెప్పిస్తూ గ్రామాలలో గొర్రెలు కాస్తూ ఉండేవాడు .ఈ మహిమలన్ని చూసినవారు తను సామాన్యమైన వాడు కాదు మహా పుణ్యాత్ముడని గ్రామస్తులు అతనిని ఒక దేవుడిగా భావించారు. భక్తి మార్గంలో నడిచి గ్రామస్తులకు ఎంతో మేలు చేశాడు, ఆయన శుద్ధ పంచమి నాడు జీవ సమాధి అయినాడు. ఆ రోజే జోడు రథోత్సవం జరుగును. ఈ రథోత్సవమును చూడడానికి ఆంధ్ర,కర్ణాటక,తమిళనాడు,రాష్ట్రాల నుండి లక్షలలో భక్తులు జోడు రథోత్సవమును చూడడానికి వస్తారు. శుక్రవారం సాయంత్రం 6గంటలకు ఈ జోడు రథోత్సవము జరుగును. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ వారు రాధాకృష్ణ భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదాన కార్యక్రమము మరియు వారికి దర్శనానికి ఇటువంటి ఇబ్బంది లేకుండా క్యూ సిస్టం చేపట్టినారు. వచ్చిన భక్తాదులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు హాలహర్వి ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

ప్రమాదకరంగా ఉన్న మారులమడకి వేదావతి కాజ్వే

విశాలాంధ్ర - హొళగుంద : ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాలకు అనుసంధానం చేసే మారుల మాడకి వద్ద ప్రవహించే వేదవతి నదిపై కోటి 34 లక్షల రూపాయలతో కాజ్వే నిర్మించారు. దీనివల్ల 96 గ్రామాలకు ప్రయాణ సౌకర్యం కలిగించడమే కాక ఇంధనా పొదుపు అవుతుంది .ఎన్నో ఏళ్ల నుండి కలగా ఉన్న వేదావతి కాజ్వే నిర్మించినప్పటికీ సిమెంట్ దిమ్మెలు ధ్వంసం కావడంతో కాజువే ప్రమాదకరంగా మారిందని ప్రజలు ఆరోపించారు .వాహనాలు సంచరించేటప్పుడు ఏదైనా యాంత్రిక లోపంతో ప్రమాదం జరగకుండా సిమెంట్ దిమ్మెలను అధికారులు నిర్మించారు .సిమెంట్ దిమ్మెలు ధ్వంసం కావడంతో కాజు వే కు అభద్రత ఏర్పడిందని సంబంధిత అధికారులు సిమెంట్ దిమ్మెలు నిర్మించకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రజలు ఆరోపించారు. భారీ వర్షం వల్ల వేదావతి నదిలో వరద నీరు ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుంటాయి. వరద నీటిలో సిమెంట్ దిమ్మె కనబడితే ఎలాంటి ప్రమాదం లేకుండా ప్రయాణించవచ్చు అని సంకేతంతో ప్రజలు వేదావతి కాజ్ వే రాకపోకలు కొనసాగిస్తున్నారు .కాజువె ఇరువైపులా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని అలాగే ఇరువైపులా ఇనుప రాడ్లు పైకి లేవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపించారు .వరద నీటిలో గుంతలు కనబడక వాహనాలు స్కిడ్ అయి కిందపడి ఎందరో బాధితులు గాయపడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి .సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేయాలని కాజువే ఇరువైపులా ఏర్పడిన గుంతలను పూడ్చి ఆహ్లాదకరమైన ప్రయాణం చేయడానికి ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు శ్రద్ధ వహించాలని ప్రజలు కోరారు.

అయ్యాచార చేయించుకోవడం జంగమ కులస్తుల సాంప్రదాయం

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : యావత్ జంగమ సేవా కులస్తులు అయ్యాచార చేయించుకోవడం తరతరాల నుంచి వస్తున్నా సాంప్రదాయంగా పాటిస్తున్నట్లు జంగమ సేవా సంఘం డివిజన్ అధ్యక్ష,కార్యదర్శి శ్రీ గురునాథయ్య,అల్కారి మఠం మహర్షి విజయ్ కుమార్ తెలిపారు. గురువారం మహర్షి విజయ్‌కుమార్ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆది జగద్గురు రేణుకాచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆదోని డివిజన్ జంగమ సమాజ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అయ్యాచార కార్యక్రమానికి విచ్చేసే జంగమ కులస్తులకు ఒక ముఖ్య గమనిక తెలియజేశారు. వివిధ జిల్లాల నుంచి అయ్యాచార చేయించుకునేందుకు వచ్చే జంగమ కులస్తులు తమ పిల్లల పేర్లను ఆధార్ కార్డుతో సహా అందజేయడం జరిగిందని, ఈనెల 24న పిడిఎఫ్ ద్వారా వివిధ గ్రూపులకు పంపడం జరుగుతుందని పిడిఎఫ్ లో మీరు పంపిన పేర్లు పొందుపరిచి ఉన్నాయో సరిచూసుకోవాలన్నారు. అయ్యాచార కోసం వచ్చే ప్రతి ఒక్కరూ దుప్పట్లు,పిల్లల ఫోటోలు 2, ఆధార్ కార్డు జిరాక్స్ తమ వెంట తెచ్చుకోవాలని మార్చి 4న పేర్లు చెక్ చేసుకోవాలన్నారు. రాత్రి గం 8లకు భోజనం శ్రీ పేట వీరభద్ర స్వామి దేవాలయం నందు,రాత్రి బస మరాఠీ

గేరిలోని వీరశైవ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మార్చి 5న ఉ,గం,,4:30 నిమిషాలకు తలనీలలు కార్యక్రమానంతరం శ్రీ పేట వీరభద్ర స్వామి దేవస్థానంలో శ్రీ ఆదిజగద్గురు రేణుకాచార్యులు మరియు వీరభద్ర స్వామికి రుద్రాభిషేకం చేసిన అనంతరం అయ్యాచార చేసుకున్న వారికి గురువులచే గురూపదేశం చేయడం జరుగుతుందన్నారు. రాత్రి గం,,8లకు పురవీధుల గుండా ఆదిగురు రేణుకాచార్యులు విగ్రహ ఊరేగింపు,ధర్మసభ,అన్న ప్రసాదంతో కార్యక్రమం ముగుస్తుందన్నారు.విలువైన వస్తువులు వెంట తెచ్చుకోవద్దని,ఎవరి వస్తువులకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుత పరిస్థితులను బట్టి మార్పు చేర్పులు ఉండవచ్చని తెలియజేశారు.